# ఇదో జబ్బు

అద్దేపల్లి ఉదయభాస్కరరావు



రంగారావు టైమ్ చూసుకుని, చాలా టైమ్ అయ్యిందే... అనుకుని రూమ్‌కి తాళంవేసి రోడ్డుమీదకి వచ్చాడు. గబగబా బస్‌స్టాప్ కేసి నడవడం మొదలుపెట్టాడు. అతని నడక సందు మలుపు తిరుగుతూండగానే చప్పబడిపోయింది. 'తను తాళంవేసి లాగి చూడలేదు. అది సరిగ్గా పడిందో... లేదో... పడేవుంటుంది... రోజూ వేసే తాళమేకదా... రోజూ వేసేదైనా ఈరోజు పడిందని నమ్మకమేమిటి? రోజూ లాగి చూసేవాడు. కనుక అలా అనుకోవచ్చు. ఈ రోజు లాగి చూడలేదు... ఎందుకిలా ఆలోచించడం? వెనక్కి వెళ్లి చూసివద్దాం... దగ్గర్లోనే ఉన్నా కదా!'

పరుగులాంటి నడకతో గుమ్మందగ్గరికి వచ్చి తాళం లాగిచూసాడు. గుమ్మానికి నిన్న పండుగ సందర్భంగా ఇంటివాళ్లు మామిడాకులు కట్టారు. అవి చేతికి తగిలాయి. పీకిపారేద్దామా అనిపించింది. కానీ అశుభమేమో అనుకుని వదిలేసాడు. మళ్లీ బయలుదేరాడు. మెట్లు

దిగాక మళ్లీ తాళంకేసి చూసి, ఇహ అనుమానం లేదు అనుకుని గబగబా నడవడం మొదలుపెట్టాడు. అరె... లోపల దొడ్డివైపు తలుపు గడియ వేసానా?... వేసినట్టు గుర్తుకురావడం లేదే... వేయలేదా... వీధితాళం చూసేటప్పుడే అది కూడా చూసేస్తే సరిపోయేదేమో... టైమ్ లేదే... ఏం చెయ్యాలి?... అయినా దగ్గరకేసే వుంటాను. ఎవరైనా తొయ్యడానికి అది వీధితలుపు కాదు. దొడ్లో ఎవడొచ్చి తీస్తాడు?... ఒకవేళ మర్చిపోయినా అది అలా గడియవేయకుండానే సాయంత్రం వరకూ అలాగే వుంటుంది... ఏమో గాలికి తెరుచుకోవచ్చేమో... ఈ రోజే ఏ దొంగైనా అదిచూడొచ్చు. లోపలికి దూరి ఆ పాతికవేలు పట్టుకుపోతే?... లాభంలేదు మరి ఏ రోజైనా వెళ్లిపోయేవాడు. ఈ రోజు తప్పనిసరిగా చూసి రావాల్సిందే. అంత డబ్బు ఇంట్లో పెట్టి ఇలాంటి అనుమానంతో ఆఫీసుకి వెళితే ఆఫీసులో పని చెయ్యగలమా? మనసంతా దీని గురించే ఆలోచిస్తూ ఆందోళన పడుతూంటే సరిగ్గా పనిచెయ్యలేము. ఆనక ఆఫీసర్ చేత తిట్లుతినకుండా ఉండలేం... ఎందుకొచ్చింది... కొద్దిగా ఆలస్యమైతే ఏదో ఒకటి చెప్పుకోవచ్చు. తిడితే పడొచ్చు. అంతేగానీ అనుమానంతో ఆఫీసుకి వెళ్లడం మంచిది కాదు.

మళ్లీ వెనుతిరిగి వచ్చి తాళంతీసి లోపలికి వెళ్లి దొడ్డితలుపుకేసి చూసాడు. గడియవేసుంది. 'రోజూ చేసే పనులు యాంత్రికంగా చేసుకుపోతాం. కానీ వాటిని మెదడు ప్రత్యేకంగా గుర్తుపెట్టుకోదు' అని చాలాసార్లు అనుకున్నాడు. కానీ దాన్ని తనే గౌరవించలేకపోతున్నాడు. ఇప్పుడు కూడా తలుపు వేసుంది. తను వేస్తాడు. కిటికీలతో సహా అన్నీ ప్రతిరోజూ వేస్తాడు. వేసి పదిసార్లు చూసి అన్నీ బావున్నాయని తేల్చుకుని అప్పుడు ఆఫీసుకి వెళతాడు. అయినా ఈరోజు డబ్బులోపలుంది. కాబట్టి ఈ భయం... అనుకుని మళ్లీ రూమ్‌కి తాళంవేసి బస్‌స్టాప్ కేసి పరిగెట్టాడు.

బస్‌స్టాప్ ఖాళీగా వుంది. ఆఫీసులో ఈపాటికి అందరూ వచ్చేసి వుంటారు. ఇప్పుడు బస్ పట్టుకుని వెళితే ఎంతలేదన్నా అరగంట లేటు. కానీ... ఏంచేస్తాం. అజాగ్రత్తగా వుండలేం... అనుమానాన్ని గాలికి వదలలేం... అనుకుని బస్ వచ్చేవైపు చూస్తూ నిలబడ్డాడు. బస్సు వచ్చింది. ఎక్కుదామని గేటుదగ్గర బార్‌పట్టుకున్నాడు. మళ్లీ ఆలోచనల్లో పడి, కండక్టరు కేక వేస్తే బార్‌ని వదిలేసాడు.

'తను పాతికవేలు సూట్‌కేస్‌లో పైన పడేసాడు. పొద్దున్న బ్యాంక్ నుంచి తెచ్చి సూట్‌కేస్ అడుగున పెడదామనుకుని, ఆ విషయం మర్చిపోయాడు. అయ్యయ్యో... సూట్‌కేస్ అడుగున పేపర్ కింద వెంటనే పెట్టెయ్యాల్సింది. అనుకున్నప్పుడు ఎందుకు చెయ్యలేదు?... చాలాసార్లు ఇదే యాతన అవుతోంది. అనుకున్నప్పుడే చేసేసుంటే ఇంక తరువాత ఆలోచించాల్సిన అవసరం వచ్చేది కాదు. అయినా దొడ్డితలుపు చూసాడు. వీధి తాళం వేసాడు. ఇంకెలా పోయే అవకాశం వుంది? అంతా అనుమానం తప్ప! అవును ఈ అనుమానం భరించలేకపోతున్నాడు. ఉత్త అనుమానం అని తెలుసు. సాయంత్రం వెళ్లేసరికి సూట్‌కేస్ తీసి చూస్తే పైన కనబడతాయని తెలుసు. అయినా ఈ అనవసరమైన ఆందోళనను పట్టించుకోకుండా వుండలేకపోతున్నాడు. తెలిసిన దానినే కేవలం ఆందోళనను తగ్గించుకోవడానికి మళ్లీ వెళ్లి చూసి రావాలి. ఛ... ఛ... ఇవాళ ఆఫీసుకి ఎప్పటికి వెళతాడు ఇలా అయితే? ఏమైతే అదే అయింది... వెళ్లి చూడటం తప్పదు.'

బస్‌స్టాప్ నుంచి పరిగెట్టుకొచ్చి రూమ్ తా

ళం తీసాడు. ఆకులు మళ్లీ ముసిముసిగా నవ్వాయి... అతన్ని వెక్కిరించినట్లు. లోపలికి వచ్చి సూట్‌కేస్ తియ్యబోతే తాళం వేసుంది. తాళం దిండుకింద పెడతాడు. తాళంతీసి సూట్‌కేస్ తెరిచాడు. డబ్బుపైనే వుంది. తీసి బట్టల అడుగున పేపరు క్రింద పెట్టి రెండు మూడుసార్లు చూసి డబ్బుపేపరు కిందవుంది అని రెండు మూడుసార్లు అనుకుని పేపర్‌పైన బట్టలు సర్దేసి సూట్‌కేస్ తాళంవేసి, ఒకసారి లాగిచూసి తాళంచెవి దిండుకింద పెట్టాడు. దుప్పటి పూర్తిగా కిందకిలాగి పక్కసర్ది అంతా ఒకసారి చూసి ఇహ ఏమీ కాదని తేల్చుకుని బయటికి వచ్చి వీధితలుపు తాళంవేసి లాగి చూసి రోడ్డుమీదకి వచ్చి నడవడం మొదలుపెట్టాడు.

'ఇప్పుడు హాయిగా వుంది. దొడ్డి తలుపు వేసినట్లు కళ్లకు కనబడుతోంది. సూట్‌కేస్‌లో పేపరు అడుగున డబ్బు, దాని పైన కాగితం, కాగితం మీద మళ్లీ బట్టలు, సూట్‌కేస్ తాళం వెయ్యటం, దిండు కింద పెట్టడం వీధితలుపు తాళం వేయడం, లాగి చూడటం, అన్నీ సవ్యంగా, సంతృప్తిగా జరిగాయి.

ఈ ఒక్కరోజే కొద్దిగా ఎక్కువ శ్రమపడ్డాడు. రోజూ ఇలా వుండదు. ఎందుకంటే నిన్ననే నాన్న ఉత్తరం రాసాడు. స్థలానికి పాతికవేలు తక్కువ అవుతాయేమో సర్దమని. ఈ రోజు డ్రా చేసాడు. రేపు ఆదివారం. సోమవారం సెలవు పెడితే మంగళ, బుధ వారాలు సెలవులు. మొత్తం నాలుగురోజులు ఇంటి దగ్గర వుండి రావచ్చు. ఆ డబ్బుని జాగ్రత్తగా ఇంటికి చేర్చేంత వరకూ కొద్దిగా ఆందోళనగానే వుంటుంది.'

ఆఫీసునుంచి సాయంత్రం రూమ్‌కి వచ్చేసరికి, రూమ్ తలుపు తెరిచి వుండటం చూసి గుండె గుభేలుమని జారి కిందపడిపోయినట్లు అయింది. ఒక్క ఉదుటున వచ్చి గమ్మంకేసి చూసాడు. తాళం అలాగే వుంది. గబగబా లోపలికి వచ్చి చూస్తే మంచం మీద తండ్రి కూర్చుని వున్నాడు.

## రచయిత(త్రు)లకు గమనిక

'కథాకేళి'లో ప్రచురించే కథలతో పాటు క్లుప్తంగా రచయితల పరిచయం కూడా ఇవ్వాలని నిర్ణయించాం. ప్రచురణ కోసం ఎంపికై మావద్ద సిద్ధంగా ఉన్న కథల రచయితలు తమ ఫోటో, పరిచయం (ప్రింట్‌లో 10 లైన్లకు మించకుండా) తెలుగులో వ్రాసి పంపించవలసిందిగా కోరుచున్నాం. - ఎడిటర్

"ఏరా... నా ఉత్తరం అందిందా? డ్రాఫ్ట్ అయితే లేటవుతుందని నేనే వచ్చాను."

"అదికాదు నాన్నా... లోపలికి ఎలా వచ్చావ్?" అంటూ సూట్‌కేస్ కేసి చూసాడు. వేసినట్లే వుంది. దిండుకింద తాళంతీసి సూట్‌కేసు తెరిచి, అడుగున చెయ్యి పెట్టాడు. నోట్లకట్ట తగిలింది. దాంతో పోయిన ప్రాణం మళ్లీ వచ్చినట్లయింది. కట్టతీసి చూసి అలాగే గుండెల కదుముకున్నాడు.

"ఆ... నేనొచ్చేసరికి తాళం వేసుంది. సరేనని ఇంటి వాళ్లింట్లో బ్యాగ్ పెట్టి, హోటల్‌కి వెళ్లి భోజనంచేసి, బజారుకు వెళ్లి పనిచూసుకుని వచ్చి మెట్లమీద కూర్చుని వీపు తలుపుకానిస్తే ఏముంది?... తలుపు లోపలికి వెళ్లిపోయింది. లేచి చూస్తే తలుపులు తీసే వున్నాయి. గుమ్మం పైకి చూస్తే తాళం వేసుంది. గొళ్లెం కిందకే వేళ్లాడుతోంది. అదీ... సంగతి.

ఓర్నీ... ఇంత అశ్రద్ధ అయితే ఎలాగరా? అంత డబ్బు లోపల వుంది. ఎంత జాగ్రత్తగా ఉండాలి? ఇంత డబ్బు, సామానూ పోతే తట్టుకోగలమా?..."